క్లుప్తంగా

మహా పాదయాత్ర విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఎస్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు ముదిరాజ్‌ను పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడుతున్నాం.. గెలిపిద్దాం అనే నినాదంతో చేపట్టే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఎస్‌ఎంఆర్ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్ గ్రామంలో యువసేన సభ్యులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బీరంగూడ మల్లికార్జున ఆలయం వరకు నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మహా పాదయాత్రకు నియోజకవర్గం నుంచి యువత భారీసంఖ్యలో తరలిరావాలని ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్తపరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మండలంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఫైలేరియాకు సంబంధించి రక్త పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన విద్యార్థులకు తగిన మాత్రలను అందజేశారు. ప్రతి విద్యార్థి ఫైలేరియాకు సంబంధించి రక్త పరీక్షలను చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓకు సంబంధించి జిల్లా అధికారి శిరీష, వైద్యులు భాస్కర్ పాఠశాల హెచ్‌ఎం ఎలీన్‌రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచండి



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతి దళిత కుటుంబానికి ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సదాశివపేట పట్టణంలోని విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దళితులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చే జీఓ 342 జీవో పూర్తి స్థాయిలో అమలు కానందునా దళితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఢిల్లీలో 300 యూనిట్లు, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దళిత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా అమలులో ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ప్రతి దళిత కుటుంబానికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, మహేష్, నాయకులు భూషణం, మల్లేష్, బాలరాజ్, ప్రభుదాస్, నాగరాజ్, రమేష్, ఆనంద్, రత్నయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా హెల్త్ క్యాంప్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా (ప్రపంచ స్ట్రోక్ డే) సందర్భంగా శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ హాస్పిటల్‌లో కార్డియాక్ హెల్త్ క్యాంపు డాక్టర్ అనిల్ కుమార్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ 300 మందికిపైగా రోగులకు కార్డియాక్ కన్సల్టేషన్‌ను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమైన పరీక్షలకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



భౌబోయ్..

ప్రధాన రహదారులపై వీధికుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండల ప్రజలు నిత్యం జహీరాబాద్‌కు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారిపై వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులను వెంబడిస్తుండటంతో ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఝరాసంగం

ఆదమరిస్తే అంతే..

జిన్నారం–జంగంపేట గ్రామాల మధ్య శివాలయానికి సమీపంలోని రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పక్కకు కుదించుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు ఈ గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. నెల రోజుల్లో 10 ఘటనలు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును బాగుచేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– జిన్నారం



ప్రమాదకరంగా రోడ్డు

అంగన్‌వాడీల వినూత్న నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించేవరకు సమ్మె కొనసాగిస్తామని నినదించారు.



కంది: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



వట్‌పల్లి: జోగిపేటలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు



నారాయణఖేడ్: అంబేడ్కర్ చౌక్ వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



హత్నూర: భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



రామచంద్రాపురం: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ముగ్గురిపై కేసు

పటాన్‌చెరు టౌన్: బస్‌స్టాప్‌ను కూల్చిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాష తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలంలోని ఘనాపూర్ గ్రామంలోని బస్‌స్టాప్‌ను గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రవీందర్, వెంకటేష్ కలిసి శుక్రవారం జేసీబీ సాయంతో కూల్చి వేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి నవోద్‌రెడ్డి బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారం వృథా చేయొద్దు

నారాయణఖేడ్: ఆహారాన్ని వృథా చేయవద్దని నారాయణఖేడ్ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ హోటళ్ల యజమానులు, సిబ్బందికి సూచించారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖేడ్ పట్టణంలో సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అవసరం మేరకే ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయవద్దని సూచించారు.

నాలుగు రోజులుగా తాగునీటికి కటకట

సంగారెడ్డి టౌన్: మిషన్ భగీరథ నీరు నాలుగు రోజుల నుంచి సరఫరా కావడం లేదని మండలంలోని అంగడిపేట గ్రామస్తులు ఖాళీబిందెలతో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే భగీరథ ట్యాంక్‌కు గ్రామంలోని బోరు బావి నుంచి కనెక్షన్ ఇచ్చి నీరు సరఫరా చేశారని, అవి రంగు మారి వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చక్రపాణి ఘటన స్థలానికి చేరుకుని, తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

‘తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం’

నారాయణఖేడ్: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖేడ్‌లో బూత్ స్వశక్తి ప్రభాస్ యోజనలో భాగంగా వివిధ మండలాల బూత్‌శక్తి కేంద్రాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారుతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

హామీలు అమలు చేస్తున్నాం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో రూ.26 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

‘కులరహిత సమాజాన్ని నిర్మిద్దాం’



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్

జహీరాబాద్ టౌన్: కుల రహిత సమాజ నిర్మాణం కోసం పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధన సమాజ్ సంస్థ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజలు, కష్టజీవులకు విద్యా, వైద్యం అందాలని, కులాలను రూపుమాపేందుకు పూలే ఈ సంస్థను స్థాపించారని చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో నడినప్పుడే కుల రహిత సామాజం సాధ్యమని తెలిపారు. వారి ఆశయ సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, నియోజకవర్గం నాయకులు ఏలియా, కోటేశ్వర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, గణేష్, ఆకాష్, నవీన్‌చ కీర్తన, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాల్సిందే..

తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి రూ.18వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. టీబీ, లెప్రసీ, కంటివెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సంగారెడ్డి టౌన్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు



జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు



వట్‌పల్లి: జోగిపేటలో డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



మునిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



పటాన్‌చెరు టౌన్: తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

జైన ఆలయంలో ప్రత్యేక పూజలు

వట్‌పల్లి(అందోల్): జోగిపేట పట్టణంలో దిగంబర్ జైన సమాజ్ పర్యూషన్ పర్వ్ వేడుకలు సెప్టెంబర్ 19 నుంచి 29 వరకు ఘనంగా జరుపుకున్నారు. జైన మతంలో ఈ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉంది. భాద్రపద మాసంలో వచ్చే దశ లక్షణ పండుగ సందర్భంగా జైనులు ప్రత్యేక పూజలు, ఉపవాసాలతో గరిష్ట సమయాన్ని గడుపుతారు. జైన మతం ప్రకారం, పది రోజుల దశ లక్షణ ఉత్సవాల్లో, ఉత్తమ క్షమా, మార్దవ, ఆర్జవ, శౌచ, సత్యం ,సన్యాసం, తపస్సు, త్యాగం, ఆకించన్, బ్రహ్మచార్య అనే 10 ధర్మాలను పాటించడం ఆచారం. అదే సమయంలో ఈ పర్యూషన్ పండుగ ఒక వ్యక్తిని కోపం, దురాశ, అనుబంధం, అసూయ ఆపుకొనలేని వంటి రుగ్మతల నుంచి విముక్తి పొందేలా ప్రేరేపిస్తుందని నమ్ముతారు. కిషన్ ప్రసాద్ జైన్, మనోహర్ ప్రసాద్ జైన్, ఇంగోలి వర్ధమాన్ జైన్, శ్రీనివాస్ జైన్, దిలీప్ కుమార్ జైన్, సంతోష్ జైన్, జైన మత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జైన ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండల అభివృద్ధికి కృషి చేయండి

- ఎంపీపీ సరళ

కంది(సంగారెడ్డి): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సరళ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందుబాటులో ఉన్ననిధుల మేరకు విడుతల వారీగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వివరాలను సర్పంచులు, ఎంపీటీసీలకు వివరించాలని సూచించారు. అనంతరం విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చించారు. జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, ఎంఈఓ వెంకట్ నర్సింహులు, పీఆర్ ఏఇ అరవింద్, ఎంపీటీసీలు నందకుమార్, హైదర్‌అలీ, వరకుమార్, భ్రమరాంబ, చంద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సరళ

టీఎస్‌పీఎస్ రద్దు చేయాలి

- గ్రూప్‌–1 అభ్యర్థుల డిమాండ్
- రూ.లక్ష పరిహారం చెల్లించాలని ధర్నా

నారాయణఖేడ్: టీఎస్‌పీఎస్సీను రద్దుచేసి గ్రూప్‌–1 అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్‌లో శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, గ్రూప్‌–1 అభ్యర్థులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి మాట్లాడుతూ గ్రూప్‌–1 నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మూడోసారి ప్రిపేర్ అవుతున్న వారికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించి అన్నిశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు లోకేష్‌రెడ్డి, సిద్దారెడ్డి, కాలె రాజు, శ్రీకాంత్, శివకుమార్, ఆనంద్, మల్లేష్, బీరప్ప, విలాస్‌కుమార్, శంకర్, శాంసన్, సంగారెడ్డి, సాజిద్ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిరుద్యోగులు, గ్రూప్‌–1 అభ్యర్థులు

సంక్షిప్త వార్తలు

◆ శ్రమదానం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయా వార్డుల్లో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్‌లు సుజాత, రత్నం తదితరులు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు.

◆ ఆర్థికసాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన ప్రవీన్‌ను ఇటీవల లారీ ఢీకొనటంతో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి లారీ యజమానితో మాట్లాడి పరిహారంగా రూ.5లక్షల చెక్కును శుక్రవారం మృతుడి కుటుంబానికి అందజేశారు.

◆ నేడు అవగాహన సదస్సు

నారాయణఖేడ్: దళిత బంధు పథకంపై ఖేడ్ మండలం జుజాల్‌పూర్ శివారులోని హెచ్‌ఆర్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 30న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రైబస, బీఆర్‌స్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

◆ ఈ– పంచాయతీ ఉద్యోగుల సమ్మె ప్రారంభం

సంగారెడ్డి టౌన్: జిల్లాలో వివిధ మండలాలకు చెందిన ఈ–పంచాయతీ టెక్నికల్ ఉద్యోగులు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబా, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సమ్మె శుక్రవారం ప్రారంభించారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న ఈ–పంచాయతీ టెక్నికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

◆ పరిసరాల శుభ్రత పాటించాలి

జహీరాబాద్ టౌన్: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని మాజీ కౌన్సిలర్ రాములు నేత అన్నారు. పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాల శుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీకి వచ్చే మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఏఎస్ఎం ఇస్మాయిల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

◆ స్కావెంజర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోండి

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కావెంజర్‌గా పనిచేయడానికి మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పతాంజలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కావెంజర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా డ్వాక్రా సంఘం సభ్యురాలై ఉండాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ కార్యాలయం, లేదా 7780541502 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ కొనసాగుతున్న సమ్మె

సంగారెడ్డి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంలేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని తెలిపారు.

◆ ఘనంగా దత్తగిరి మహారాజ్ జన్మదిన వేడుకలు

నారాయణఖేడ్: ఖేడ్ దత్తగిరి ఆలయంలో శుక్రవారం దత్తగిరి మహారాజ్ 101వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ వివేకానంద్, రామాలయం కమిటీ చైర్మన్ హన్మండ్లు సేట్, భక్తులు పాల్గొన్నారు.

◆ పింఛన్ పత్రాలు అందజేత

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగుల పదవీ విరమణ పొందిన నెలాఖరున ఫించను పత్రాలు మంజూరు చేస్తూ ప్రయాస పథకంతో మన్ననలు అందుకుంటుందని పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ పీవీరావు అన్నారు. సెప్టెంబర్ నెలలో 20 మందికి పింఛను మంజూరు చేయగా 13 మందికి పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఫించన్ పత్రాలను అందజేశారు.